క్లుప్తంగా

సమస్యలు ఉంటే తెలపండి

బందరు కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో ఏ సమస్య ఎదురైనా ఫిర్యాదు చేయడానికి తమ కార్యాలయంలో ప్రజావాణి విభాగాన్ని ఏర్పాటు చేశామని కమిషనర్ బాపిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సమీపిస్తుండటంతో తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ఆక్రమణలు తదితర సమస్యలు ఎదురైతే నగర ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో కూడా విభాగం పనిచేస్తుందని తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు 849907989, 08672-227700 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

నేడు పెడనలో ప్రజాదీవెన

పెడన: పట్టణంలో ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి, అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పట్టణంలో శుక్రవారం పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జున రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు పైడమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజాదీవెన ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు

పెడన: అనధికార లేఅవుట్లకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని, ఎవరైనా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)కు వ్యతిరేకంగా లే అవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామని ముడా ప్లానింగ్ అధికారి శాంతిలత అన్నారు. ఆమె మండలంలోని బల్లిపర్రు గ్రామ సమీపంలో గురువారం ఉదయం లేఅవుట్‌ను పరిశీలించారు. పోలీస్ బందోబస్తుతో ఆమె లేఅవుట్‌ను సందర్శించి క్షేత్రస్థాయి సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ముడా జూనియర్ ప్లానింగ్ అధికారి సుగుణకుమారి, పంచాయతీ కార్యదర్శి బొల్లా నాగరాజు, వీఆర్వో గణేష్, ఎస్‌ఐ-2 సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అధికారులూ.. కోడ్ అమలులో అప్రమత్తం


ఎంపీడీవో మారుతీ శేషమాంబ

శ్రీకాకుళం(ఘంటసాల): మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమల్లో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో మారుతీ శేషమాంబ గురువారం సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

మోపిదేవి: మండలంలోని పెదప్రోలులో క్లస్టర్ 30వ నంబర్ వలంటీర్ ఇంటి వద్ద అక్రమంగా నిల్వచేసిన మద్యం సీసాలను బుధవారం రాత్రి ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టుకున్నట్లు ఎంపీడీఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఎక్సైజ్ అధికారులు సీజ్ చేయడంతో సంబంధిత వలంటీర్‌ను విధుల నుంచి గురువారం తొలగించినట్లు పేర్కొన్నారు. తొలగించిన కాపీని సమాచారం కోసం ఆర్‌ఓకు పంపినట్లు ఎంపీడీఓ తెలిపారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన చెత్త ట్రాక్టర్



మచిలీపట్నంటౌన్: నగరంలోని జెడ్పీ సెంటరులో గురువారం నగరపాలకసంస్థకు చెందిన చెత్త ట్రాక్టర్ దుకాణంలోకి దూసుకెళ్లింది. చెత్తను సేకరించి వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా స్విమ్మింగ్‌పూల్ ఎదురుగా ఉన్న షాపుల వైపు దూసుకెళ్లింది. దీన్ని గమనించిన అక్కడి ప్రజలు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. చెత్తను సేకరించి చిలకలపూడి నుంచి డంపింగ్‌యార్డుకు వెళ్తున్న ట్రాక్టర్ స్టీరింగ్ బోల్ట్ ఊడటంతో ఈ ప్రమాదం జరిగిందని కమిషనర్ బాపిరాజు తెలిపారు.

తీరప్రాంత గ్రామాలకు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



కృత్తివెన్ను: మండల పరిధిలోని సముద్ర తీరానికి అత్యంత చేరువగా ఉండి తాగునీటికి ఇబ్బంది పడుతున్న గ్రామాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేపట్టినట్లు ఎంపీడీవో పిచ్చిబాబు తెలిపారు. గురువారం చినపాండ్రాక పంచాయతీలోని రామాపురం, సీతారామపురం, చెరుకుమిల్లి పంచాయతీలోని ఉప్పులూరు, ఇంతేరు పంచాయతీలోని పార్వతీపురం, మాట్లాం గ్రామపంచాయతీ ఈ ఐదు గ్రామాలకు కలెక్టర్ నిధుల నుంచి ట్యాంకర్లు ఏర్పాటు చేశామన్నారు. అవసరాన్ని బట్టి నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి వాటికి కూడా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పథంలో..



నాడు నేడుతో రూపురేఖలు మారిన పెడన మండలం పెనుమల్లి ప్రాథమిక పాఠశాల

ఇది కదా.. అభివృద్ధి

పెడన రూరల్‌లోడీబీటీ ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసిన వివరాలివి

పథకం	లబ్ధిదారులు	నిధులు రూ.
వైఎస్సార్ పెన్షన్ కానుక	6,648	63,51,65,250
జగనన్న అమ్మ వడి	3,319	15,10,40,211
వైఎస్సార్ చేయూత	2,509	11,59,12,500
వైఎస్సార్ ఆసరా	7,512	26,20,15,220
వైఎస్సార్ రైతు భరోసా	6,778	31,11,47,600
ఇంటి నిర్మాణానికి(నేరుగా చెల్లింపు)	835	9,92,52,360
వైఎస్సార్‌సున్న వడ్డీ(డ్వాక్రా గ్రూపులు)	9,175	1,95,72,107
వైఎస్సార్ కాపునేస్తం	1,071	4,47,75,000
ఉచిత పంటల బీమా	4,692	8,26,67,756
జగనన్న విద్యాదీవెన	2,404	9,07,63,643
జగనన్న వసతీ దీవెన	1,814	3,29,96,812
వైఎస్సార్ నేతన్న నేస్తం	1	24,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	54	14,25,000
వైఎస్సార్ బీమా	94	1,37,30,000
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడి	5,255	4,39,41,992
వైఎస్సార్ వాహన మిత్ర	464	1,34,10,000
సున్నవడ్డీ పంట రుణాలు	3,295	83,84,052
	55,920	192,50,63,503

- పెడన రూరల్ ప్రాంతాలకు కొత్త కళ
- గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- నాడు నేడుతో ఆరోగ్యకేంద్రాలు.. ప్రభుత్వ బడులకు నూతన హంగులు..
- డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు



పెడన మండలం పుల్లపాడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్



'గడప గడప' నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు



పెడన మండలం పెనుమల్లి రైతుభరోసా కేంద్రం

పెడన: పెడన మండలంలోని రూరల్ ప్రాంతాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులకు సంక్షేమ పథకాలు అందుతుండటమే కాకుండా సేవలను ప్రజలకు చేరువ చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు నిదర్శనం. అర్హులైన లబ్ధిదారులకు డీబీటీ (డైరెక్ట్ బెనిఫిషర్ ట్రాన్స్‌ఫర్)నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేయడమే కాకుండా పరోక్షంగా లబ్ధిదారులకు కోట్లాది రూపాయలను అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

- పెడనలో డాక్టర్ వైఎస్సార్ అగ్రిల్యాబ్, పశుసంవర్ధక శాఖ ల్యాబ్‌లను రూ.66.80లక్షలతో నిర్మించారు. రూ.15 లక్షలు నుంచి రూ.20 లక్షల వరకు ఎక్విప్‌మెంటును ఏర్పాటు చేశారు.
- మండలంలో ఒక్కో రైతు భరోసా కేంద్రాన్ని రూ.21.80లక్షలతో నిర్మించారు. 17 ఆర్‌బీకేలకు ఏడు పూర్తి చేసుకున్నాయి.
- వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు 15 మంజూరవ్వగా ఒకోంక దాని నిర్మాణానికి రూ.17.50లక్షలు కేటాయించారు. కొన్ని పూర్తవ్వగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి.
- జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొదటి విడతలో పెడన రూరల్ ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలకు రూ.4.15 కోట్లతో కుళాయిలు ఏర్పాటు చేసింది
- 17 గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణానికి రూ.6.55 కోట్లు మంజూరు చేశారు. ఒక్కో సచివాలయం నిర్మాణానికి రూ.40లక్షలు కేటాయించారు.
- ఈ ప్రాంతాల్లో సుమారు రూ.6.19కోట్లతో సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైయినేజీల పనులు ముమ్మరంగా కొనసాగుతుండగా మరికొన్ని పూర్తయ్యాయి.

ఇవే కాకుండా రూ.1.57కోట్లు జెడ్పీ నిధులు, రూ.కోటి మండల పరిషత్ నిధులతో కూడా పనులు చేస్తున్నారు.

ఇతర పథకాల ద్వారా..

ఇతర పథకాల ద్వారా 13,185 మంది లబ్ధిదారులకు రూ.6,88,30,767లను అందజేసింది. మొత్తం డీబీటీ ద్వారా 69,105 మంది లబ్ధిదారులకు రూ.199,38,94,270 వారి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. నాన్ డీబీటీ ద్వారా 20,167 మంది లబ్ధిదారులకు రూ.67,46,44,533 అందజేసింది. వెరసి డీబీటీ, నాన్ డీబీటీ కింద 89,272 లబ్ధిదారులకు రూ.266,85,38,803ను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసింది.

ఇఫ్తార్ విందు



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఇంగ్లిష్‌పాలెం మసీదులో గురువారం జరిగిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ లైన్లకు మరమ్మతులు

కృత్తివెన్ను: స్థానిక 33 కేవీ లైను వైర్లపై కొబ్బరి చెట్టు పడటంతో 5 విద్యుత్ స్తంభాలు విరిగిపోయినట్లు ఏఈఈ వెంకన్నబాబు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే అధికారులు యుద్ధ ప్రాతిపదికన లైను మరమ్మతులు చేపట్టారు. నూతన స్తంభాలు ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన కొత్త విద్యుత్ వైర్లును సైతం వేసి సరఫరాను పునరుద్ధరించారు.

వాహనాల తనిఖీ



ఘంటసాల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి పత్రాలు లేకుండా నగదు, బంగారు ఆభరణాలు తరలించకూడదని ఘంటసాల ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఘంటసాలలో గురువారం సాయంత్రం ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్, గ్రామ శివార్లలో వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు.

పార్టీ కార్యాలయాలకు అధికారుల అనుమతి ఉండాలి

తహసీల్దార్ శాంతి

గూడూరు: సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలులో వచ్చిన నేపథ్యంలో పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతి పొందాలని గూడూరు తహసీల్దార్ ఎస్.ఎస్.శాంతి స్పష్టం చేశారు. గూడూరులో ఉన్న పలు రాజకీయ పార్టీ కార్యాలయాలకు ఏర్పాటు చేసిన బోర్డులు, ఫ్లెక్సీలు, జెండాలను గురువారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతం నుంచి కార్యాలయాలు ఉన్నా ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో పెడన రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల పరిశీలకులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందని, అనుమతి లేని ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేస్తే ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులు నమోదు చేస్తామని ఆమె స్పష్టం చేశారు.



గూడూరులోని టీడీపీ కార్యాలయం వద్ద బోర్డులు, ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశిస్తున్న తహసీల్దార్

నాగాయలంక: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉండటంతో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని నాగాయలంక ఎస్.ఐ ఎం.సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక ప్రధాన కూడలిలో గురువారం రాత్రి ప్రజలకు ఎన్నికల కోడ్, నియమావళిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్నికల తరుణంలో ఘర్షణలకు పాల్పడితే భవిష్యత్‌లో నేరస్తులుగా మిగిలిపోతారని సాధారణ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ముగిసే వరకు వివిధ పార్టీల కార్యకర్తలు ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దని, ప్రచారం ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి జరపాలని సూచించారు. ఏఎస్‌ఐ కె.గణేష్, పోలీసు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



కోడ్, శాంతి భద్రతలపై నాగాయలంక సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం

అందుబాటులో డయాలసిస్ సేవలు

- ఐదు నెలల క్రితం డయాలసిస్ సెంటర్ ప్రారంభం
- ఇప్పటి వరకూ 579 సార్లు డయాలసిస్ సేవలు
- 23 మంది పేషెంట్లకు సేవలు
- తగ్గిన దూరాభారం



అవనిగడ్డ డయాలసిస్ సెంటర్

అవనిగడ్డ: 'నాగాయలంక మండలం మర్రిపాలెంకు చెందిన విమల గత మూడేళ్ల నుంచి గుంటూరు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. అవనిగడ్డలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడంతో ఇక్కడ నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నారు.' ఇలా దివిసీమకు చెందిన 23 మంది పేషెంట్లు ఇబ్బందులు పడుతూ దూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకునే సమస్య తొలగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ మేరకు ఐదు నెలల క్రితం అవనిగడ్డలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ఈ ప్రాంత కిడ్నీ రోగులకు విశేష సేవలు అందిస్తోంది.

హామీ మేరకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవనిగడ్డ పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విజ్ఞప్తిపై డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఏపీ వైద్య ఆరోగ్యశాఖ, అపోలో సహకారంతో రూ.14.50 లక్షలతో గత ఏడాది నవంబర్ 2వ తేదీన అవనిగడ్డ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో డయాలసిస్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు.

తొలగిన ఇబ్బందులు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 23 మంది డయాలసిస్ పేషెంట్లు ఉన్నారు. వీరంతా గతంలో విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, హైదరాబాద్ వెళ్లి డయాలసిస్ సేవలు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ సేవలు తీసుకునేందుకు ఎంతో వ్యయప్రయాసలు పడేవారు. డయాలసిస్ కేంద్రాలకు వెళ్లాలంటే మరొకరి సాయం కావాల్సి వచ్చేది. వెళ్లిన సమయానికి ఏదైనా సమస్య ఎదురైనా, రోగులు ఎక్కువగా ఉన్నా మరో రోజు అక్కడ ఉండాల్సి వచ్చేది. అవనిగడ్డలో డయాలసిస్ కేంద్రంను ఏర్పాటు చేయడంతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన సెంటర్‌లో మొత్తం ఆరు డయాలసిస్ యంత్రాలు ఏర్పాటు చేశారు. ఒక డాక్టర్, ముగ్గురు టెక్నీషియన్లు ఇక్కడ డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకూ 579 సార్లు డయాలసిస్ సేవలు అందించారు. ప్రారంభించిన నవంబర్ నెలలో 8 సార్లు, డిసెంబర్‌లో 82, జనవరిలో 144, ఫిబ్రవరిలో 201, మార్చిలో ఇప్పటి వరకూ 144 సార్లు రోగులకు డయాలసిస్ సేవలు చేశారు. అవనిగడ్డలో సెంటర్‌ని ఏర్పాటు చేయడంతో దూర ప్రాంతానికి వెళ్లే ఇబ్బందులు తొలగిపోయాయని పలువురు డయాలసిస్ పేషెంట్లు సంతోషం వ్యక్తం చేశారు.

గతంలో వేరేచోటుకు వెళ్లాల్సి వచ్చేది



మూడు సంవత్సరాల నుంచి డయాలసిస్ తీసుకుంటున్నాను. గతంలో గుంటూరు, విజయవాడకు వెళ్లి డయాలసిస్ చేయించుకునేవాడిని. అక్కడకు వెళ్లాలంటే మరొకరి సహాయం కావాల్సి వచ్చేది. అవనిగడ్డలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. –కె.శివశంకర్, మండపాకల

వ్యయ ప్రయాసలు తగ్గాయి



గతంలో మచిలీపట్నం వెళ్లి డయాలసిస్ చేయించుకునేదానిని. అవనిగడ్డలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి రావడంతో ఇక్కడే చేయించుకుంటున్నాను. మాకు దగ్గరగా సెంటర్ ఉండటంతో వ్యయ ప్రయాసలు తగ్గాయి. ఇక్కడ వైద్య సిబ్బంది బాగా చూసుకుంటున్నారు. –కె.నిర్మల, మోపిదేవి

24న రామేశ్వరస్వామివారి ఆలయంలో ధాన్యాభిషేకం

టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలోని శ్రీ కాంచి కామకోటి పీఠస్థ శ్రీబాలా పార్వతి సమేత శ్రీరామేశ్వరస్వామివారి ఆలయంలో 24వ తేదీ ఆదివారం ధాన్యాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు నవధాన్యాలు వేదమంత్రాలతో స్వామివారి ఉత్సవ మూర్తులకు ధాన్య సమర్పణ జరుగుతుందని పేర్కొన్నారు. లోకకల్యాణార్థం అభిషేకం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

25న అయ్యప్పస్వామి తిరునక్షత్ర పూజలు

కోడూరు: అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్పస్వామివారి దేవాలయంలో ఈ నెల 25న స్వామివారి తిరునక్షత్రం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం అయ్యప్ప మూలమూర్తికి పంచామృతాభిషేకం, పుష్పార్చన జరుగుతుందని అనంతరం గజవాహనంపై ఉత్సవ మూర్తిని ఊరేగించనున్నట్లు వివరించారు.

రామలింగేశ్వరుడి ఆదాయం రూ.3.57 లక్షలు

మచిలీపట్నం టౌన్: నగరంలోని రాబర్ట్‌సన్ పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం, ఆలయ ఉపాలయాల్లో గురువారం హుండీల్లోని కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలోని నాలుగు హుండీలు, ఉపాలయాలైన శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో రెండు హుండీలు, శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలోని ఒక హుండీలో కానుకలు లెక్కించగా రూ.3,57,678 ఆదాయం వచ్చినట్లు ఈవో బి.సుబ్బారెడ్డి తెలిపారు.

నివాళి

మచిలీపట్నంటౌన్: ఇటీవల మృతి చెందిన నడికోట ప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) గురువారం నివాళులర్పించారు. చిలకలపూడిలోని ప్రసాద్ ఇంటి వద్ద జరిగిన పెదకర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ చిత్రపటం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ప్రసాద్ కుమారుడు శ్రీనివాస్, కుటుంబ సభ్యులకు పేర్ని కిట్టు సానుభూతి తెలియజేశారు.

డౌన్ సిండ్రోమ్.. జన్యుపరమైన రుగ్మత



ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు పలకలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శేఖర్‌సింగ్

గూడూరు: డౌన్ సింద్రోమ్ అనేది జన్యుపరమైన రుగ్మత అని గూడూరు ఎంఈవో బీఎస్‌సీ శేఖర్‌సింగ్ అన్నారు. ప్రపంచ డౌన్ సింద్రోమ్ డే పురస్కరించుకుని గూడూరులోని భవిత కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ 35 ఏళ్లు పైబడిన తర్వాత గర్భం దాల్చే మహిళలు ప్రసవించిన శిశువుల్లో క్రోమోజోములు అసమతుల్యత కారణంగా డౌన్ సింద్రోమ్ కనిపిస్తోందన్నారు. అలాంటి మహిళలు గర్భిణిగా ఉన్నప్పుడు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటే పుట్టే శిశువులు ఆరోగ్య వంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో గూడూరు హైస్కూల్ హెచ్‌ఎం డి.పుష్పలత, ఎంపీపీ మెయిన్ పాఠశాల హెచ్‌ఎం కె.వాణి, ఐఈఆర్పీ పి.రమాదేవి, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా... ఆశీర్వదించండి

ముఠా కార్మికులతో పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: అన్ని వేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కోరారు. నగరంలోని కోనేరుసెంటర్‌లో గురువారం ముఠా కార్మికులను ఆయన కలిశారు. ప్రతి కార్మికుడిని పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమ కుటుంబాలు ఎంతో ఆనందంగా జీవించాయని, తాము అడగకుండానే పలు పథకాల ద్వారా మేలు చేశారని చెప్పారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకుంటామని కార్మికులు పేర్ని కిట్టుకు వివరించారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పేర్ని వెంకట్రామయ్య (నాని) కూడా తమ సమస్యల పరిష్కారానికి ముందుండేవారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యేగా మిమ్మల్ని గెలిపించుకుంటామని వారు చెప్పారు. ఈ పర్యటనలో కిట్టు వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, మాడపాటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ బీసీ, యువజన విభాగాల అధ్యక్షులు వీఎన్ మూర్తి, వేముల కృష్ణ, వైఎస్సార్ సీపీ నగర నాయకులు బందెల థామస్‌నోబుల్, షేక్ మొహమ్మద్‌సాహెబ్ ఉన్నారు.



ముఠా కార్మికులతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

ఎన్నికల నియమావళిని పాటించాలి

బందరు డీఎస్పీ మహమ్మద్ అబ్దుల్‌సుభాన్

కోనేరుసెంటర్: ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని బందరు డీఎస్పీ మహమ్మద్ అబ్దుల్ సుభాన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాకు విచ్చేసిన కేంద్ర సాయుధ బలగాలతో బందరు సబ్‌డివిజన్ పోలీసులు మచిలీపట్నంలో గురువారం కవాతు నిర్వహించారు. హైనీ హై స్కూలు వద్ద నుంచి ప్రారంభమైన కవాతు లక్ష్మీటాకీస్‌సెంటర్, జిల్లాకోర్టుసెంటర్, బస్టాండ్‌సెంటర్, కోనేరుసెంటర్‌ల మీదుగా కోటావారితుళ్లసెంటర్, బుట్టాయిపేట, రామానాయుడుపేట, పరాసుపేట, చిలకలపూడి, జెడ్పీ సెంటర్ మీదుగా తిరిగి స్కూలు వద్దకు చేరింది. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అల్లర్లకు ఎవరైనా యత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ సీఐ జేవీ రమణ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మచిలీపట్నం పురవీధుల్లో సాయుధ బలగాలు, సబ్‌డివిజన్ పోలీసుల కవాతు

తూనికలు కొలతల అధికారుల తనిఖీలు

పామర్రు: తూనికలు కొలతల అధికారులు పామర్రులోని పలు కూరగాయల దుకాణాల్లో గురువారం తనిఖీలు చేశారు. గ్రామంలోని రైతుబజారు, కూరగాయల మార్కెట్, ప్రైవేటు దుకాణాలు, ఎంఎల్‌ఎస్ పాయింట్ తదితరాలలోని కాటాలను పరిశీలించారు. కాటాలకు కొత్త సీళ్లను వేశారు. సమీప గ్రామాల్లోని దుకాణాలను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో తూనికలు కొలతల శాఖకు చెందిన నందిగామ, గుడివాడ, విజయవాడ, అసిస్టెంట్ కలెక్టర్లు ఎస్‌యూ భాను ప్రసాద్, టి.రాజేంద్ర ప్రసాద్, బి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SHAIK ZAINULABEDIN** (Old Name), Resident of Door No. 4-90-1, Rajupet, Mchilipatnam, Krishna District, A.P. I have changed my name as **MOHAMMAD ZAINULABEDIN** (New Name) S/o. **KHURSHID ALAM** Hereafter my name is known as **MOHAMMAD ZAINULABEDIN** (New Name) S/o. **KHURSHID ALAM**

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్

99122 20543 (మచిలీపట్నం, పెడన)

79955 66983, 99122 20545 (అవనిగడ్డ)

Office mail : sakshiads@gmail.com